# సిలువ నీడ

క్రైస్తవ ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

మార్చి-ఏప్రిల్ 2021

గౌరవ సంపాదకులు

రెవ. డా॥ వి. నాగేశ్వరరావు

ప్రచురణ

ఐనోను ప్రార్ధనా మందిరము

వార్షిక విరాళం : రూ. 200/-

విడి ప్రతి : రూ.35/-

## అన్యజనులలో ఆయన మహిమను ప్రచురించుడి

కీర్తన 96:3





# సంపాదకీయం

## వినుచున్నావా?

పదహారు సంవత్సరాల చదువు అంటే సంపూర్ణముగా విద్య ముగిసినట్టు అని అనుకోవచ్చు. లేదా పై చదువులకు ఎక్కడైనా, విదేశమైన వెళ్ళడానికి అది ఒక అర్హత కూడ. పిల్లలు పుట్టినప్పటి నుండి ఏదో ఒక రకముగా నేర్చుకుంటూనే ఉంటారు. వీటిలో నాలుగు రకాలు ఉంటాయి. చూసి గమనించి విని, చదివి అర్థం చేసుకుని, విని నేర్చుకోవడము, ఆఖరిది చేస్తూ నేర్చుకోవడము. ఈ నాలుగు విషయాలు గురించిన ప్రస్తావన పరిశుద్ధ గ్రంథములో లేవు గాని, వినుట గురించిన వాక్యభాగములు మనకు తెలుసు. వినుటకు వేగిర పడుము, వినుటవలన విశ్వాసము కలుగును, చెవి గలవాడు వినును గాక, ఇవన్నీ ప్రభువు వినుట గురించి పలికిన మాటలు ముప్పది సవంత్సరముల తరువాత ఏ మనిషి ఎవరి మాట వినడానికి ఇష్టపడడు. అలా వింటున్నాడు అంటే ఏదో అవసరము. ప్రభువు మాట్లాడే మాటలు నీవు వింటున్నావా, రోజు ప్రభువు నీతో మాట్లాడుతున్నారా. ఆయనతో పరిశుద్ధ సహవాసము ఆత్మలో అనుభవము కలిగియున్నావా, వినుట అంటే విధేయత, రక్షణ వినుటతో మొదలవుతుంది. పాపము అవిధేయతతో మొదలవుతుంది. ప్రభువు వలన మనకు మంచే జరుగుతుంది కదా. ప్రభువు ఆజ్ఞ కూడా నెరవేర్చినవారమవుతాము.

**ఈస్టర్ శుభాశీస్సులతో...**

గౌరవ సంపాదకులు
రెవ. డా॥ వి. నాగేశ్వరరావు
ఐనోను ప్రార్థనా మందిరము

సంపుటి -6 సంచిక-2

మార్చి-ఏప్రిల్ 2021

గౌరవ సంపాదకులు

రెవ. డా॥ వేజండ్ల నాగేశ్వరరావు

సంపాదకులు

సహో. నత్తల శశిభూషణరావు

ప్రచురణ

ఐనోను చర్చి, హైదరాబాద్

వార్షిక చందా - రూ. 200/-

**Printed and Published by**
Bro V.Vijaya Sudhaker
on behalf of Aenon Church,
Hyderabad , Plot no.469 ,
Dr YSR Enclave Colony,
Neknampur, Puppalguda,
Rajendra Nagar (Md), R.R. Dist.
Hyderabad - 500 089. T.S.

You can send your subscriptions donations to this account
Truevine Ministries
Indianoverseas Bank, Srinagar Colony,
AC. No. 189001000001433
IFSC Code : IOBA0001890

"సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి" మార్కు 16 : 15



# సిలువ నీడ

క్రైస్తవ ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



| | |
|---|---|
| పనికి కుదిరావా? | 2 |
| - డా॥ వి. రాజు | |
| చనిపోయి గెలిచిన రాజు-విస్తరించిన రాజ్యము | 8 |
| -సహో. వి. వి. చందర్ | |
| సమయము-విగ్రహము | 11 |
| -సహో. వి. వి. చందర్ | |
| కల్వరి ప్రదక్షిణ | 15 |
| -బ్రదర్ .డి.సి. వెంకయ్య IRSS | |
| యోబు సాక్ష్యము | 19 |
| -పాస్టర్. ప్రభాకం | |
| సిద్ధపడిన హృదయం-స్థిరమైన మనసు | 21 |
| పాస్టర్ డానియేల్ | |
| అనుదినము | 26 |
| -పాస్టర్ పి. ఐజక్ | |

**Disclaimer**

Siluva Needa may not agree in part or in full , with the views expressed by the writers.

సిలువ నీడ పత్రిక Online లో చదువుటకు
ఇప్పుడు మన website:
www.aenonchurch.org లో
login అవ్వండి

All the readers, you can write to us of how you are spiritually benefitted by the messages published. We would like to mention that in the next edition. You can also send your prayer requests, witnesses to the church address. We thank our loving LORD and all the writers and supporting staff in helping us.



- డా॥ వి. రాజు

# పనికి కుదిరావా?

సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19

**శిష్యత్వము ప్రభువు ఆజ్ఞ :** శిష్యత్వము క్రైస్తవ జీవితములో మిక్కిలి ప్రాముఖ్యమైనది. కాని క్రైస్తవులు దానిని పట్టించుకొనక అది తమకు సంబంధించిన విషయమే కాదన్నట్లు దానిని ఉపేక్షింతురు. అయితే ప్రతి క్రైస్తవుడు ప్రప్రథమముగా ఒక శిష్యుడని దేవుని వాక్యము తెలియ జేయుచున్నది. ప్రభువైన యేసు క్రీస్తు భూమి మీద తన పరిచర్య ముగించి, సర్వమానవ పాపపరిహారము నిమిత్తము సిలువపై ప్రాణమర్పించి, మృతిపొంది, సమాధి చేయబడి, పునరుత్థానుడైన తరువాత పరలోకమునకు అరోహణుడై వెల్లుటకు ముందు తన పదునొకండు శిష్యులను పిలిచి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడని చెప్పెను. మత్తయి 28:19 ప్రభువు యొక్క మహా ఆజ్ఞకు (దా గ్రేట్ కమీషన్) లోబడి ఆ శిష్యులు ప్రభువు ఆజ్ఞాపించిన విధముగా పరిశుద్ధాత్మ వచ్చువరకు యెరూషలేములో వేచియుండి, పెంతెకోస్తు దినమున పరిశు ద్ధాత్మ శక్తితో వారిపై వచ్చినప్పటి నుండి యెరూషలేము, యూదయ, సమరయ మరియు భూదిగంతముల వరకు సువార్త ప్రకటించుచు శిష్యులను చేయుచూ వెళ్లిరి. అపోస్తలుల కార్యములు 1:8;2 అట్టి శిష్యుల సంఖ్య విస్తరించుచున్నదని అపోస్తలుల కార్యములు 6:1లోను మరియు ఆ శిష్యులను బెదిరించుటకు హాని చేయుటకు సౌలు బయలు దేరెనని అపోస్తలుల కార్యములు 9:1లో మనము చూతుము. అపోస్తలుల కార్యములు 11:26

యొద్దకు వచ్చునప్పటికి ఆ శిష్యులు మొట్టమొదటగా క్రైస్తవుడని అంతియొకయలో పిలువబడిరని చదువుదుము. ఇందునుబట్టి ప్రతి క్రైస్తవుడు మొదటగా ఒక శిష్యుడని తెలియును క్రీస్తుకు మహా ఆజ్ఞకు లోబడి అపోస్తులులు మరియు ఆ తర్వాత వచ్చిన శిష్యులు పరిచర్య కారణముగా ఈ రోజు మనము క్రైస్తవులుగా ఉన్నాము. కాబట్టి ప్రతి శిష్యుడనగా నేమి శిష్యత్వము అనగా నేమి, శిష్యుడెట్లుండవలెనో తెలుసుకొనవలెను.

**2 శిష్యత్వము నిర్వచనము :** హెబ్రీ భాషలో శిష్యుని **"విమ్మడ్"** అన్నారు శిష్యుడనగా నేర్చుకొనువాడు, వెంబడించువాడని అర్ధము. శిష్యుడు తన గురువు లేక భోధకుని యొద్ద సమస్తము నేర్చుకొని సంపూర్ణముగా తన గురువు లేక బోధకుని

వలె మార్పుచెందవలెను. సిద్ధుడైన శిష్యుడు తన బోధకుని వలె ఉండవలెనని ప్రభువు చెప్పెను. లూకా 6:40. నేను క్రీస్తును పోలి నడుచుకొన్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడని పౌలు చెప్పెను. 1 కొరింథీయులు 11:1 ఒక నిజమైన శిష్యుడు కేవలము నేర్చుకొనువానిగా మాత్రమే గాక నేర్చుకొన్నదానిని జరిగించువానిగా ఉండవలెను. మత్తయి 7:21-27. అంతకు మించి అతడు తన గురువును అనుకరించు వానిగా ఉండవలెను. శిష్యులు గురువు మాదిరిని అనుసరించవలెను. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని అని యేసు చెప్పెను. యోహాను 13:15. శిష్యుని జీవితము ప్రతి సందర్భములో ఇట్టి పరిస్థితులలో ప్రభువేమి చేయునను ప్రశ్నతో నడుచును.

**3. శిష్యత్వ సాంప్రదాయము :** శిష్యత్వ సాంప్రదాయము తూర్పు దేశములకు చిరపరిచితము. ప్రాచీన కాలములో భారత దేశములో గురువుల వనాశ్రమాలు, గురుకులాలు వాటిలో రాకుమారులతో సహా అనేకులు శిష్యరికం చేసిన గాథలెన్నో మనం వినియున్నాము. శిష్యరికం చేసిన వాళ్లు ఎంత రాజకుమారలైనా సామాన్యులవలె గురువల చెప్పుచేతుల్లో ఉండి, కాయకష్టం చేస్తూ సకల విద్యలు అభ్యసించే వారని విన్నాము. రాజ భవనాలు, సౌకర్యాలు విడిచి అడవుల్లో వనాల్లో ఆశ్రమాల్లో ఉండి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు గురువులు చెప్పిన పనులన్నీ చేస్తూ అక్కడే తిని, అక్కడే పండుకొని ఉండేవారు. ఇదేరకంగా చైనా దేశములో షావ్‌లిన్, జపాను దేశములో నింజా గురు శిష్య సాంప్రదాయాలు పేరొందినవి. యూదా మతంలో ప్రవక్తల శిష్యులు ఉండేవారు. ఈ ప్రవక్తల శిష్యులను గూర్చి సమూయేలు కాలంలో 1 సమూయేలు 19:18-24 మరియు ఏలియా, ఎలీషాల కాలంలో 2 రాజులు 2,4 అధ్యాయాల్లోను, అమోసు 7:14లోను చూడగలము. ప్రభువు భూమిపై జీవించిన కాలానికి ఇశ్రాయేలీయులలో రబ్బీల పాఠశాలలుండేవి. యేసుక్రీస్తును కూడ రబ్బీ అని పిలిచారు. యోహాను 3:2 ఈ రబ్బీలు శిష్యులను కలిగి యుండి వారికి ధర్మశాస్త్రాన్ని జ్ఞానాన్ని బోధిస్తూ ఉండేవారు. అటువంటి ఒక రబ్బీయైన గమలీయేలు పాదాలవద్ద సౌలు పెరిగి, ధర్మశాస్త్ర సంబంధమగు నిష్టయందు శిక్షితుడయ్యాడు. ఒక గురువు వద్ద విద్య అభ్యసించుట పూర్తియైన శిష్యుడు తిరిగి తాను శిష్యులను ప్రోగుచేసుకొని తిరిగి వారికి విద్య నేర్పుట ద్వారా గురు శిష్య పరంపర కొనసాగేది. యేసు ప్రభువు కూడ తనకు శిష్యులను ఏర్పాటు చేసుకొని తర్ఫీదు ఇచ్చారు.

**4. యేసు పాఠశాల**

యేసు ప్రభువు తానే తన శిష్యులను ఏర్పాటు చేసుకొని వారికి శిష్యత్వపు తర్ఫీదు ఇచ్చెను. ప్రభువు తర్ఫీదు సులువైనదిగాను మూడు భాగములుగాను ఉండెను. అది మూడు మాటలలో చెప్పవచ్చును. 1. నా వెంబడి రండి 2. నా యొద్ద నేర్చుకొనుడి. 3. మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. యేసు ప్రభువు శిష్యులు మూడింటినీ చేసిరి.

1. నా వెంబడిరండి లేక రండి, నన్ను వెంబడించుడి యేసు ప్రభువు తానే తన శిష్యులను ఏర్పరచుకొనెను. యేసు గలిలయ సముద్ర తీరమున నడుచు చుండగా పేతురనబడిన సీమోను అతని సహోదరుడైన ఆంద్రెయ అను ఇద్దరు సహోదరులు సముద్రములో వలవేయుట చూచెను; వారు జాలరులు ఆయన నా వెంబడిరండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేతునని వారితో చెప్పెను; వెంటనే వారు తమ వలలు విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి. ఆయన అక్కడ నుండి వెళ్లి జెబెదయి కుమారుడైన యాకోబు అతని సహోదరుడైన యోహాను అను మరి ఇద్దరు సహోదరులు తమ తండ్రియైన జెబెదయి యొద్ద దోనెలో తమ వలలు బాగుచేసికొనుచుండగా చూచి వారిని పిలిచెను. వెంటనే వారు తమ దోనెను తమ తండ్రిని విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి. మత్తయి 4:18-22, గలిలయ సముద్ర ప్రాంత ప్రజల ముఖ్య వృత్తి చేపలు పట్టుట అట్టి జాలరులైన పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానులు తమ పనిలో నిమగ్నులై ఉండగా ఇద్దరు చేపలు పట్టుటకు వలవేయు చుండగా మరి వలలు బాగు చేసుకొను చుండగా వారిని యేసు పిలిచెను. వారు తమ దోనెలను, వలలను తాము చేయుచున్న పనిని అనగా వలలు వేయుట వలలను బాగు చేసుకొనుట, చివరికి తమ తండ్రియైన జెబదయిని కూడా విడిచిపెట్టి వచ్చి యేసుని వెంబడించిరి. ఇంకను యేసు సుంకపు మెట్టుదగ్గర కూర్చుండియున్న మత్తయి అను ఒక మనుష్యుని చూచి నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా అతడు లేచి ఆయనను వెంబడించెను. మత్తయి 9:9 పన్నులు వసూలు చేయు సుంకపు మెట్టును విడచి ప్రభువును వెంబడించెను. అటువలెనే ఫిలిప్పును, నతానియేలును ప్రభువు పిలువగా ఉన్న పాటున సమస్తమును విడిచి వారాయనను వెంబడించిరి. ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను, పిల్లలు, అన్నదమ్ములను, అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు అని యేసు చెప్పెను. లూకా 14:26. శిష్యులు యేసు వెంట, ఆయన ఎక్కడకు వెళ్లిన అక్కడకు వెళ్లిరి. కొండ మీదకు సముద్రమునకు

సమాజమందిరమునకు, దేవాలయ మునకు, యెరూషలేముకు, బేతనికి, కపెర్నహోముకు, నజరేతుకు, ఇంకను అనేక చోట్లకు వెళ్లిరి. ఆయనతోనే ఉండిరి. వెంబడించుటలో మంచి మాదిరిని శిష్యులు చూపించిరి. యేసు శిష్యుల వలె మనమును ప్రభువును వెంబడింపవలెను..

**2. నా యొద్ద నేర్చుకొనుడి :** యేసు పాఠశాలలో శిష్యత్వపు శిక్షణ యొక్క రెండవ సూత్రము ఆయన యొద్ద నేర్చుకొనుట. ప్రయాసపడి భారము మోసికొనుచున్న వారిని ఉద్దేశించి మీమీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి అని యేసు చెప్పెను. మత్తయి. 11:29 యేసు శిష్యులకు తన మాదిరి ద్వారా బోధించెను. నేను చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని అని ఆయన చెప్పెను. ఆ మాట చెప్పుటకు ముందు ఆయన తన శిష్యుల పాదములు కడిగెను. యోహాను 13:4-15 ఆయన శిష్యులను తనతోపాటే అన్నిచోట్లకు తీసికొని వెళ్లెను. ఆయన అందరికి ఉపమానములతో బోధించి వారికి ఉపమానముల అర్థమును ప్రత్యేకముగా తెలియ జేసెను. శిష్యులు కూడ వారికి అర్థము కాని సంగతులను గూర్చి ప్రభువును అడుగగా ఆయన వారికి స్పష్టముగా అర్థమగునట్లు వివరించేవాడు. మత్తయి 13:10-23 యేసు ప్రభువు బోధలే కాక ఆయన జీవితము మరియు ప్రవర్తన నుండి శిష్యులు ఎంతగానో నేర్చుకొనిరి. ఆయన ప్రేమ కనికరములను వారు అతి దగ్గరగా ఉండి చూచిరి. ఆయన జన సమూహములను చూచి వారు కాపరిలేని గొఱ్ఱెల వలె విసికి చెదరి యున్నందున వారిపై కనికరముతో కదలిపోయెను. మత్తయి 9:35-36 మార్కు 6:34-46, ఆయన శిష్యులు చూచుచుండగా ప్రతి విధమైన రోగమును ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపరచెను. అయిదు రొట్టెలు రెండు చేపలతో అయిదువేల మంది పురుషులకు ఆహారము పెట్టెను. ఆయన శ్రమలో కూడ మంచి మాదిరి ఉంచిపోయెనని పేతురు, తెలియజెప్పెను. 1 పేతురు 2:21 యేసు తన శిష్యులకు బోధించుటకే కాక డెబ్బదిమంది ఇతరులను నియమించి తను వెళ్లబోవు ప్రతి ఊరికిని ప్రతి చోటికిని తన కంటె ముందు ఇద్దరి నిద్దరినిగా పంపెను. లూకా 10:1 వారు స్వయముగా పరిచర్య చేయగలుగునట్లు యేసు ప్రభువుకు అతి చేరువలో ఉండి ఆయన యొద్ద నేర్చుకొనినవారు అనేకులు వారిలో మరియ ఒకరు. ఈమె యేసు పాదముల యొద్ద కూర్చుండి ఆయన బోధ వినుచుండెను. లూకా 10:39 వినుట వలన విశ్వాసము కలుగును వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును. మనమును ఎల్లప్పుడు క్రీస్తు బోధలు వినుట, చదువుట, ఆచరించుట యందు ఆసక్తి కలిగియుండవలెను. 2 తిమోతి 2:15;

ప్రకతన 1:3.

**3. మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి:** యేసు మనుష్యుల కొరకు రక్షణ కార్యము ముగించునప్పటికి తన శిష్యుల శిష్యత్వ తర్ఫీదు పూర్తి చేసి వారికి తన చివరి అంతిమ మరియు మహా ఆజ్ఞను యిచ్చెను. ఆయన వారి యొద్దకు వచ్చి పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది. కాబట్టి మీ రు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తీస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నింటినీ గైకొనవలెనని వారికి బోధించుడి. అని ఆజ్ఞాపించెను. మత్తయి 28:18-20 ఆ మహా ఆజ్ఞ ప్రకారమే ఆ నాటి శిష్యులు సువార్త ప్రకటించి, సువార్తకులోబడిన వారికి బాప్తీస్మ మిచ్చుచు, ప్రభువు ఆజ్ఞాపించిన వాటి నన్నింటినీ బోధించుచు శిష్యులను చేయు క్రమమును ప్రారంభించిరి. ఆ క్రమము ప్రకారమే మనము కూడ సువార్తకు లోబడి క్రైస్తవులనబడు శిష్యులమైనాము. ఇదే మహా ఆజ్ఞ. వేరు మాటలలో "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును అని మార్కు 16:15 లోను యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడునని లూకా 24:47 లోను వ్రాయబడి యున్నది. ఇది తిరిగి శిష్యులను తయారుచేయు క్రమము. శిష్యుని పని తిరిగి శిష్యులను చేయుట శిష్యులను తయారు చేసి వారిని పెంచి పోషించుట ప్రభువు అప్పగించిన పని. యేసు పేతురుతో ఉపమాన రీతిలో నా గొఱ్ఱెపిల్లలను మేపుమని, నా గొఱ్ఱెలను కాయుమని, నా గొఱ్ఱెలను మేపుమని చెప్పెను. యోహాను 21:15-18 శిష్యులను చేయుట వారు సిద్ధులగునట్లు ఆయన ఆజ్ఞాపించిన వాటినన్నింటినీ గైకొనునట్లు చేయుట క్రీస్తు ముద్ర ఉన్న శిష్యత్వము. శిష్యుడు తన గురుకుల పరంపరను ముందుకు తీసికొని వెళ్ళినట్లు క్రీస్తు శిష్యుడు ఆయన పనిని అనగా అనేక కుమారులను మహిమకు తెచ్చుపనిని, ముందుకు కొనసాగించవలెను.

**ముగింపు/సారంశము :**

**1. శిష్యుని పని :** శిష్యుని పని యేసుని వెంబడించుట మత్తయి 4:19 సువార్త ప్రకటించుట శిష్యునిపని మార్కు 16:15 శిష్యులను చేయుట శిష్యుని పని మత్తయి 28:19 శిష్యుడు వాక్యమును ప్రకటించవలెను. సమయమందును అసమయమందును ప్రయాసపడవలెను. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో

ఉపదేశించుచు ఖండించుచు గద్దించి, బుద్ధి చెప్పవలెను. 2 తిమోతి 4:2 క్రీస్తును పోలి నడుచుకొనవలెను. 1 కొరింథీ 11:11 శిష్యులు క్రీస్తు సారుప్యములోనికి ఎదుగుట శిష్యత్వపు పరాకాష్ట. రోమీయులు 8:29, కొరింథీయులు 3:18, శిష్యులు తమ పని చేయుటయే కాక ఆ పనిని కొనసాగించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింప వలెను. 2 తిమోతి 2:2

**2. అది కష్టమైన పని :** యేసు శిష్యులను చూచి ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెనని చెప్పెను. మత్తయి 16:24 శిష్యుడు సమస్తమును ప్రభువుకొరకు తన ప్రాణముతో సహా ఉపేక్షించుట చాలా కష్టము లూకా 14:26 తనకు లాభకరమైన వాటి నన్నింటినీ పౌలు నష్టముగా ఎంచుకొని సమస్తమును పెంటతో సమానముగా ఎంచుకొనెను. ఫిలిప్పీ యులు 3:4-11 క్రీస్తే నాయందు జీవించుచున్నాడని పౌలు చెప్పెను. గలతీయులు 2:20 జీవించువారిక మీదట తమ కొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించవలెనని అతడు వ్రాసెను. 2 కొరింథీయులు 5:15

**3. శిష్యత్వము ఒక ధన్యత/ఆధిక్యత :** పిలవబడిన వారు అనేకులు, ఏర్పరచబడిన వారు కొందరే. మత్తయి 22:14 యేసు శిష్యులలో అనేకులు వెనుకకు తీసి, మరి ఎన్నడును ఆయనను వెంబడింప లేదు, యోహాను 6:66 శిష్యత్వము దేవుని ఉన్నతమైన పిలుపు, దానికి బహుమానము కలుగును. ఫిలిప్పీయులు 3:14 అది పరిశుద్ధమైన పిలుపు. 2 తిమోతి 1:9 పునఃస్థితి స్థాపనయందు తన శిష్యులు పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రముల వారికి తీర్పు తీర్చుదురని ప్రభువు చెప్పెను. ప్రభువు నామము నిమిత్తము అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను, తండ్రినైనను తల్లినైనను పిల్లలనైనను, భూములనైనను, ఇండ్లలైనను విడిచిపెట్టిన ప్రతివాడును నూరు రెట్లు పొందును. ఇదిగాక నిత్యజీవమును స్వతంత్రించుకొనును. అని కూడ ప్రభువు చెప్పెను. మత్తయి 19:28-29. ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించు వాని కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్యహృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడియున్నది. 1 కొరింథీయులు 2:9 ప్రభువు శిష్యులుగా నమ్మకముగా పనిచేసి దేవుడిచ్చు బహుమానము పొందుదుము గాక.

-సహో. వి. వి.చందర్

# చనిపోయి గెలిచిన రాజు-విస్తరించిన రాజ్యము

గొప్ప గొప్ప యుద్ధాలు మహా గొప్ప రాజులు, యుద్ధంలో గెలిస్తే రాజ్యం ఓడినట్టే రాజు చనిపోయినట్టే లేదా బందీగా తీసికొని పోబడటము ఆ రాజ్యమును కూల్చి కాల్చి వేయబడటము, ఇవి జరిగేవి. కాలము, ఏదైనా, సమయము ఏదైనా, రాజు ఎవరైనా, యుద్ధము ఏదైనా ఒకరు ఓడిపోవడము, ఒకరు గెలవడము, ఒకరు చనిపోవడము బ్రతికినవారు గెలిచిన రాజ్యము స్వాధీన పరచుకోవడము ఇదంతా మనకు తెలిసిన యుద్ధనీతి, కానీ లోకమునకు తెలియని ఒక యుద్ధము జరిగినది. అందులో ఒక మానవుడు, మనుష్యకుమారుడు, చేసిన యుద్ధమును గురించి మనము తెలుసుకుందాము. ఆ రాజు యేసుప్రభువులవారు. ఆయన చేసిన యుద్ధము, ఆయన గెలుపును గురించినదే ఈ భాగము.

**రాజు :** యేసు ప్రభువుల వారే ఈ రాజు సమాధానపతి, దేవుని కుమారునిగా భూమిమీదకు దిగివచ్చిన యేసుప్రభువు, ఒక గొప్ప కార్యమును జరిగించుటకు వచ్చినారు. అదే సిలువ కార్యము. ఈ గొప్ప కార్యమును గురించి మనమందరము ఎరిగే ఉంటున్నాము. ప్రవచనాల నెరవేర్పుగా (యెషయా 9:6) ఆయన తన భుజము మీద రాజ్యభారమును కలిగినవాడై విచ్చేసినాడు. 7వ వచనమును చూస్తే, ఇది మొదలుకొని మీరు మితిలేకుండా దానికి (రాజ్యమునకు) వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును. న్యాయము వలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును" యేసు ప్రభువుల వారు ఆయన 30వ సంవత్సరము నుండి పాపము, పాపక్షమాపణ గురించి, దేవుని గురించి, పరలోక రాజ్యమును గురించి భోధించుట ప్రారంభించినారు. అయితే ఆయన రాజుగా కాక సేవకునిగా పనిచేసినారు. రాజుగా కాక, సేవకునిగా? అలా అయితే మరి మనము ఆయనను రాజు అని ఎందుకు అంటున్నామో ఆయన మీద దేవాది దేవుని రాజ్యభారము ఉండినది కాబట్టి ఆయనే రాజు అంతేనా ఆయన ఈ సృష్టి సమస్తమును ఆయన ఆధీనములో ఉన్నది. ఆయన ఆజ్ఞ లేకుండా ఏదీ జరగదు, జరగలేదు. పాపము మీద ఆయనకు అధికారము కలదు, అనారోగ్యము, మీద అధికారము కలదు

జీవము మీద మానవుని జీవితము మీద అధికారము కలదు. ఆయనకు సమస్తము మీద అధికారము కలదు, ఆయన అధికారమునకు లోబడనిది ఏదీ లేదు. మరి ఆయన అదే సమయములో సేవకునిని అని ఎందుకు అన్నారు. పరలోక రాజ్యమును వదలి భూమి మీదకు దిగివచ్చిన యేసు, కేలము మానవుని పాపము కొరకు సిలువ కార్యమును జరిగించిన ఆయన మానవుని కన్నా తక్కువగా తగ్గించుకొన్న యేసు అప్పుడు సేవకునిగానే ఉన్నట్టు మనము చూడగలము. అయితే మనము ఆయనను రాజుగా ధ్యానిస్తున్నాము కదా, ఆయనకన్న ఏ రాజు గొప్పవాడు కాదూ, కాని ఏ రాజు ఉండని రీతిలో తనను తాను తగ్గించు కున్నాడు ఈయన చనిపోయిన లాజరును తిరిగి లేపి (4వ దినమున) ఆ విషయము అక్కడి ప్రజలందరికి తెలిసి వారు ఆయనను ఘనపరచుటకు ఇష్టపడి ఆయనను యెరూషలేము పట్టణము లోనికి తీసుకొని వచ్చిన విధానము మనము ధ్యానించాము. ఆయన ఒక గాడిద పిల్ల మీద ఎక్కి, అందరూ తమ వస్త్రములను గానీ, మట్టలను గానీ ఆ దారిలో పరచి గౌరవించారు. మాములుగా అయితే గుఱ్ఱము ఎక్కి రావలసిన రాజు, రాజు వస్తున్నప్పుడు పరిచే తివాచీలు గానీ, పువ్వులు గాని, అందరి వంటి రాజు కాదు అని తెలియకనే తెలుస్తున్నది. ప్రత్యేకమైన రాజు, ప్రేమ కలిగిన రాజు, తగ్గించుకునే రాజు, ఈలాంటి రాజు మనకు ఎక్కడ ఉంటాడు.

**యుద్ధము :** ఈ యుద్ధము అన్నీ యుద్ధాలలానే రెండు రాజ్యాల మధ్య జరిగినదో లేక ఇద్దరు రాజుల మధ్య జరిగినదో అని మనము చెప్పలేము, కాని ఈ యుద్ధము యేసుప్రభువుల వారు మరణము మీద జరిగించి గెలిచినారు. పాపము, పాపము వలన వచ్చే మరణము నుండి ఆ మరణ శిక్ష నుండి మనలను తప్పించాలి, లేదా మరొక గొఱ్ఱె పిల్లను వధించాలి, కాని ఆ ఒక్క గొఱ్ఱె పిల్ల ఒకరి పాపమునకు మాత్రమే సరిపోతుంది. అదే కాక క్షమాపణ లేనటువంటి పాపములు అనేకములు మరణశిక్షే శిక్షగా ఉన్న శిక్షలు అనేకము ఉన్నాయి. మరి వాటి ప్రకారము చాలా మంది మరణశిక్ష కూడా పడాలి అలా అయితే వారు నశించిపోతారు. కానీ ఎవరు నశించిపోవడము దేవునికి ఇష్టము లేదు కాబట్టి అందరి తరుపున ఆ శిక్షలన్నీ భరించడానికి మరణించాలి? ఆయన కుమారుడైన యేసు ప్రభువును భూమి మీదకు పంపినారు. యేసు ప్రభువల వారు ఆయన మరణము మీద అధికారము గలవారు కాబట్టి, జీవము, జీవితము మీద అధికారము కలవాడు కాబట్టి, ఆయన ఈ యుద్ధమును

జరిపినారు. అయితే విచిత్రము ఏంటో చూడండి, ప్రభువు చిపోయినారు. అంటే యుద్ధము గెలిచినట్టా? ఓడిపోయినట్టా? శుక్రవారము నాడు, శనివారము నాడు, ఆఖరికి ఆదివారము ఉదయము కూడా ఎవరికి తెలియలేదు. ప్రభువు జరిపినా ఆ యుద్ధము ఆ రాజు గెలిచినారని శిష్యులకు లోకానికి తెలిసినది.

రాజు మరణించినారు, తద్వారానే గెలుపు సాధ్యమైనది. ఈ లోకములో ఏ రాజుకు ఏ యుద్ధ నేర్పరి తనము, నైపుణ్యము గల వారు ఎవరైనా కూడా చాలా కూడా చాలా సులువుగా అర్ధం చేసుకోగలరు. రాజు చనిపోతే, యుద్ధము ఎలా గెలుస్తారు, అసాధ్యం కదా. అదే దేవుని కార్యము

**రాజ్యము :** దేవుని రాజ్యము ప్రభువు రాకతో నూతన నిబంధనగా మొదలై ప్రవచనాల విధముగా విస్తరించు రాజ్యముగా, వర్ధిల్లు రాజ్యముగా నిలచినది. రాజు చనిపోతే రాజ్యము ఎలా విస్తరిస్తున్నది, అంటే రాజు చనిపోయి తిరిగి లేచినారు కాబట్టి, రాజుకు మరణము పై అధికారము ఉన్నది కాబట్టి, విజయము తథ్యము. శత్రువు ఓటమి తథ్యము అయ్యింది. రాజ్య విస్తరణ కూడా తథ్యమే. పన్నెండు మంది శిష్యులతో మొదలైన రాజ్యము, ఇప్పుడు కోట్లమందితో కూడ ఉన్నదంటే దానికి మనము సాక్షులము. పరిశుద్ధాత్మ దేవుని ఆదరణతో ప్రతి నాలుక దేవుని స్తుతించాలి. ఆయన సన్నిధిలో మోకరించి ప్రార్థించాలి. ఆయన నామమును అంగీకరించాలి. సర్వలోక మునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుము అని యేసు ప్రభువుల వారు పలికిన మాటలు, ఆజ్ఞగా పాటించి ముందుగా యూదా, గలలీయ, సమరియ ప్రాంతాలు, తరువాత గలతి, ఫిలిప్పీ, ఎఫెసీ మొదలగు ఇంకెన్నో సంఘాలు స్థాపించి దేవుని కొరకు శిష్యులను, ఆత్మలను సంపాదించిన శిష్యులు, ఆ పిదప ఇంకెంతో మంది శిష్యులు, అలా లోకమంతా ప్రభువు రక్షణ సువార్తను విస్తరింపచేయబడినది. పరమదేవుడు రాజాధిరాజు, తన ప్రాణమును అర్పించి సిలువలో మరణించిన రాజు, ఈ లోకములోని ఏ రాజు, రాజ్యమునకు జరగనట్టుగా, ఆయన మరణించి తన రాజ్యమును నిలిపి విస్తరింపచేసినాడు. ఆయన తిరిగి లేచి నిన్ను, నన్ను మన అందరిని రెండవ మరణమునుండి తప్పించి నిరీక్షణలోనికి మనలను నడిపింపచేసిన రాజు, యేసయ్య. మనలను విశ్రాంతిలోనికి నడిపించిన రాజు మన అభిషిక్తుడైన ప్రభువు.

ఈస్టర్ శుభములతో...

-సహో. వి. వి.చందర్

# సమయము-విగ్రహము

సిలువ నీడ పాఠకులందరికి ప్రభువైన యేసుక్రీస్తు నామమున శుభాశీస్సులు. ప్రతి శీర్షికను మీరు మీ కుటుంబము వారందరు క్రమం తప్పకుండా చదువుతున్నారని తాద్వారా దేవుని ఆశీర్వాదములను పొందుకొనుచున్నారని నమ్ముచున్నాను. అందుకొరకు మీ సమయమును ఏర్పాటు చేసుకుంటు న్నారని ఆశీస్తున్నాను.

కోవిడ్-19 మహమ్మారి విజృంభించిన ఈ సంవత్సరకాలమంత కూడా అందరము ఇళ్లల్లోనే నిలచి ఉండిపోవాలసి వచ్చినది. ఎవరు ఎక్కడికి వెళ్ళాలన్నా భయము, ఎక్కడ వారికి ఈ అనారోగ్యము వస్తుందో అని అందరికి దూరముగా ఉండటము, ఎవరికైనా దగ్గరకు వెళ్ళాలంటే భయము, ఇంటికి ఎవరినన్నా రానీయాలన్న ఎంతో ఆలోచించాల్సి రావడము ఎవరన్న పెళ్ళిళ్లకు పిలిచిన పోలేక పోవడము, ఎవరు మరణించిన కూడా పరామర్శించడానికి వెళ్ళకపోవడము, ఇవన్నీ ఎంతో భయం కరమైన స్థితిగతులు ద్వారా పోవలసి వచ్చినది. అయితే ఇంత ఘోరమైన స్థితిలో కూడా ఒక మంచి జరిగినది అంటే అది సమయము. అందరికి కావలసినంత సమయము దొరికినది. ఉరుకులు పరుగులు మీద ఉండే ఈ లోకమంతా కూడా ఒక్కసారిగా స్థంభించిపోయినది. ఎక్కడివారు అక్కడ ఎటు కదలకుండా, కదల లేకుండా అయిపోయారు. ఎంత ఆశ్చర్యము ఉరుకులు పరుగుల మీద ఉండే ఈ లోకము ఒక్కసారిగా నిలబడి పోయింది. ఆగిపోయింది. కరోనా వ్యాధి మనము లోకమును సమయమును చూసే విధానమును మార్చివేసింది. ఇశ్రాయేలీయులు అనేక మారులు దేవుని ఆగ్రహమునకు గురయ్యారు. దానికి కారణములు ఎన్నో ఉన్నా, అన్నిటికన్నా ఎక్కువ మారులు దేవుని ఉగ్రతకు వారు గురవ్వడానికి వారి విగ్రహాలే కారణము. ఐగుప్తు దాసత్వము నుండి వారిని విడిపించిన దేవాది దేవుడు సీనాయి పర్వతమున పది ఆజ్ఞలను ఇచ్చారు, అలాగే ధర్మశాస్త్రమును కూడా అనుగ్రహించారు. అందులోని మొదటి ఆజ్ఞగా "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" అనునది కానీ ఇశ్రాయేలు ప్రజలు ఈ మొదటి ఆజ్ఞను మీరినారు. చుట్టూ ఉన్న

దేశాలలో ప్రజలు వ్యభిచరించినట్లుగా వీరు కూడా విగ్రహాలను పూజించడము మొదలుపెట్టారు. ఇది ఇలా కొనసాగుతూ ఉండినది. యెహోవా దేవుడు ఎన్ని మారులు వారిని గద్దించిన హెచ్చించిన వారు విధేయత చూపలేదు. యెషయా, యిర్మీయా, ఏలీయా మరి ఎందరో ప్రవక్తల ద్వారా దేవుడు వారితో మాట్లాడినను, హెచ్చరించినను వారు ఆయన మాటను విననొల్లక పోయిరి. విగ్రహారాధన వదలిపెట్టక ఉండినారు. దేవుని ఉగ్రతకు పాత్రులైన ఎన్నో మారులు ఆయన వారిని చెరలోనికి పంపినా వారి వైఖరి మారలేదు. కానీ, దేవునికి మహిమ ఇప్పుడు అదంతా లేదు. మరి లేని విగ్రహాల గురించి ఎందుకు మనము మాట్లాడుకోవడము అంటే ఆ విగ్రహాలు పోయాయి కానీ, వాటి స్థానమున వేరే విగ్రహాలు వచ్చాయి.

అయ్యా పొద్దున్నే లేచి ప్రార్థన చేసావా, వాక్యమును చదివి ధ్యానించావా అంటే, అయ్యా నాకు అంత సమయము ఉండదు. నేను ప్రొద్దునె లేచి త్వరగా నా పనికి పోవాలి, అయ్యా, అవునా, మరి సాయంత్రము కుటుంబ ప్రార్థన ఉంటుందా అని అడిగితే అవునయ్యా అందరము కలసి చేసుకోవాలని అనుకుంటాము కానీ ఒక్కొక్కరము ఒక్కొక్క సమయములో ఇంటికి వస్తాము. కాబట్టి కుదరడము లేదు, అయ్యగారు అని అంటుంటారు చాలా మంది పోని ఆదివారము సంఘములో ఉంటున్నారా అంటే అవునయ్యగారు సమయము దొరికినప్పుడెల్లా వెళ్తున్నాము. కాని నెలలో ఒక్కసారే సమయము కుదుర్తుంది అని చెప్పేవాళ్ళు ఉన్నారు. అందరు ఇలా ఉన్నారని కాదు గాని ఉన్నవాళ్ళు దయచేసి మీ పనులను సమయమును సరిగా ఉపయోగించండి. చాలా గొప్ప గొప్పగా జ్ఞానము కలిగిన వారు మాట్లాడే మాటలు కూడా ఒక్కసారి బోల్తా పడవచ్చు. గమనించి చూద్దాము, ప్రియమైన దేవుని బిడ్డలారా మనము ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండటము, మంచిది కాని అందులోనే తలమునకలై పోయెంతగా ఉండటము మాత్రము మంచిది కాదు, ఎందుకో చూద్దాము "సోమరీ చీమల యొద్దకు వెళ్లుము వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము అంటూ సామెతలు గ్రంథ కర్త వ్రాసిని మాటలను మనము ఎరుగుదుము అంటే ప్రభువే మనలను రోజు పనిచేసికొమ్మని చెబుతున్నారు. అలానే మొదట నా నీతిని రాజ్యమును వెదుకుడి" అని కూడా చెబుతున్నారు. పని చేయాలి కాని దాని కన్నా ముందు స్థానములో దేవుడు

ఉండాలి. దేవుని తరువాతనే మిగిలినవన్నీ కానీ మనము ఇప్పుడు ఎలా ఉన్నాము అన్ని ఆ తరువాతే దేవుడు ఎవరి వద్ద దేవుని కొరకు సమయము లేదు ఆయనను ప్రార్థించుటకు వాక్యము ధ్యానించుటకు ఎక్కడ సమయము. ఆదివారాలు కూడా ఉద్యోగమో, ఇంకేవో పనులు పెట్టుకుని బిజీగా ఉండిపోతున్నారు. ఆదివారము గుడికి వెళ్ళేవారు కూడా సరిగా సమయానికి వచ్చేవాళ్ళ శాతం చాలా తక్కువ పాస్టర్ గారు వాక్యము బోధించడము మొదలు పెట్టాక వచ్చే వాళ్ళ శాతము ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయాలలో పనిచేసి పగలునిద్రపోయే గందరగోళ లోకములో ఎంతో మంది యవ్వనస్థులు ఉన్నారు. వారి ఉద్యోగాలు అలా ఉన్నాయి. నిజమే మన జీవనమును కొనసాగించుకొనుటకు ఉద్యోగము అవసరము, కాలీగా ఉండుటము దేవునికి ఇష్టము లేదు. తప్పకుండా పనిచేయాలి, అలాంటి ఉద్యోగాలు కూడా చేయాలి. కానీ దేవుని సన్నిధి సహవాసము విడువ కూడదు, అది మనము ఎప్పుడు మనస్సులో ఉంచుకోవాలి. దేవుడు ఆ తరువాతే అన్నీ అనేది మనము మన హృదయాలలో నిలుపుకోవాలి. ఒక్కరోజులో 24 గంటలు అందులో మూడో వంతు అంటే ఎనిమిది గంటలు మనము నిద్రలో ఉంటాము. మిగిలిన 16 గంటలు వ్యవధిలో పదవ వంతు దేవునిది. ఆ సమయమును దేవుని సన్నిధికి గడపడానికి ప్రయత్నించండి. కార్పోరేటు సంస్థలు వారి ఉద్యోగులు వారి మొత్తం సమయము ఆ సంస్థ కొరకే వెచ్చించేలా చూసుకుంటారు. పొద్దున్నే 6 గంటలకు లేవాలి. వ్యాయామము, పిల్లల బడులు వగైరా తరువాత ఆఫీసుకు వెళ్ళి సాయంత్రము వరకు పని చేయడము అలసి ఇంటికి వచ్చి తినేసి పడుకోవడము, మరలా ప్రొద్దున్నే లేచి తయారై ఆఫీసుకు వెళ్ళిపోవడము, ఇదే జరుగుతుంది. ఎందుకంటే వారకి ఎటువంటి వేరే ఆలోచనలకు సమయము ఇవ్వకూడదు అలా సమయము ఇస్తే వారు వేరే ఉద్యోగాలకు వెళ్ళిపోతారేమో, ఇంకా వారే సొంతంగా బిజినెస్ పెట్టుకుంటారేమో అని ఈ విధముగా వారిని వారి పనిలో నిమగ్నమై ఉండేటట్లు చేస్తారు. దేవుని కొరకు మనము సమయమును తీయకుండా చేసేది ఎవరు, శత్రువే కదా, అ చిన్న విషయమును మనము గ్రహించలేక పోవడమే, వివేకము లేక పోవడమే శత్రువు చేసే పని. అందుకే

యేసు ప్రభువుల వారు "సర్పమువలె వివేకము కలిగి ఉండుమని బోధిస్తున్నారని శత్రువునుండి సర్పము తప్పించుకున్నంత త్వరగా తెలివిగా ఏ జంతువు తప్పించు కోలేదు. మనము శత్రువు యొక్క పన్నాగములను అలానే తప్పించుకోవాలి. మనము దేవుని కొరకు సమయమును తీయలేనిస్థితిలో ఉండకూడదు ఎక్కువ ప్రార్థించండి, ముందుగా ప్రార్థనలో దేవుని సన్నిధిలో ఉండునట్లు ప్రార్థించండి, రాజుగా ఉన్న దావీదు దినమునకు ఎన్ని మారులు ప్రార్తించేవాడు, మనము ఆయన కన్నా గొప్ప వాళ్ళమా వేరే రాజ్యములో, ఇతర దేశపు రాజ్యములో చెరలో ఉన్న దానియేలు ఎన్నో మారులు ప్రార్థించేవాడు ఒకే దినములో, ఆయన కన్నా కష్టమైన స్థితిలో మనము ఉన్నామా. అసలే లేము కదా. సమయము నీకు ఒక విగ్రహము కాకూడదు దేవుని మహిమ పరచుటకు ఒక ఆధారము కావాలి, సమయము నిన్ను దేవుని నుండి దూరము చేయకూడదు, ఇశ్రాయేలీయులను ఆనాడు ఇతర దేశపు విగ్రహాలు ఆకర్షించి వారిని భ్రష్టుపట్టిం చినట్టు ఈనాడు చాలా మందికి ఈ సమయము ఒక విగ్రహమైపోయినది. ఈ సమయములో అది చేయాలి ఇది చేయాలి అక్కడికి వెళ్ళాలి, ఇక్కడికి వెళ్ళాలి అని ప్రణాళిక తయారు చేసుకుంటాము గాని ఈ సమయమును దేవునికి ఇవ్వాలి, ఆయన పని కొరకు వెచ్చించాలి అని ఎవరు అనుకోవడము లేదు.

ప్రియమైన దేవుని బిడ్డలారా మీరు ఈ శీర్షిక ప్రతిదీ చదువుతున్నారు అంటేనే మీరు దేవుని కొరకు సమయమును వెచ్చిస్తున్నారని మీతో పాటు ఉన్నవాళ్ళ సమయము దేవుని కొరకు కాక శత్రువు పన్నాగములో ఉండిపోతున్న వారిని దేవుని మహిమకొరకు జీవించడమును గురించి మన సమయమును ఆయన మహి మార్ధమై వెచ్చించడమును గురించి మాట్లాడండి వారికి నేర్పించండి. దేవుని కొరకే సమయమును వెచ్చిస్తే మా పనులు ఎలా ఎవరు చేస్తారు అని అనుకోవద్దు. దేవుని వాక్యమే సెలవిస్తుంది అనేక మారులు, అనేక చోట్ల ఆదాము హవ్వల కొరకు అయిదు దినాలు శ్రమించిన దేవాది దేవుడు అడవి పువ్వులను అందంగా సృష్టించిన దేవుడు మనలను గురించి శ్రద్ధ తీసుకొనరా? ఖచ్చితముగా నీ గురించి ఆయన శ్రద్ధ వహిస్తారు గదా విశ్వాసము కలిగి ముందుకు నడవండి. మళ్ళీ మళ్ళీ లేదు బ్రదర్ నాకు సమయము లేదు, కుదరలేదు అనే మాటలు అనకండి, దేవుని మహిమపరచడమే మన ముఖ్యపని అని తెలిసి మసులుకోండి. ఈస్టర్ శుభాశీస్సులతో...

-బ్రదర్ .డి.సి. వెంకయ్య
IRSS

# కల్వరి ప్రదక్షిణ

(గతసంచిక తరువాయి)
"సైనికులు యేసును సిలువవేసిన తర్వాత ఆయన వస్త్రములు తీసికొని ఒక్కొక్క సైనికునికి ఒక్కొక్క భాగము వచ్చునట్లు వాటిని నాలుగు భాగములు చేసిరి. ఆయన అంగీని కూడ తీసికొని, ఆ అంగీ కుట్టు లేక పైనుండి యావత్తు నేయబడినది కనుక వారు, దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దాని కోసరము చీట్లు వేయుదమని ఒకరితో ఒకరు చెప్పుకొనిరి. "వారు నా వస్త్రమును తమలో పంచుకొని నా అంగీకోసరము చీట్లువేసిరి" అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను. ఇందుకే సైనికులు ఈలాగుచేసిరి. యోహాను 19:23-24.
గతసంచికలో యేసు ప్రభువు సిలువ దగ్గరనున్న ఏడు రకాల ప్రజలు ఉన్నట్లుగా తెలియచేసివుంటున్నారు. ఆ ఏడు రకాల ప్రజలలో మొదటిగా ''సైనికులు'' వుంటున్నారు. వారు చేసిన పనిని యోహను తన సువార్త 13వ అధ్యాయము 23, 24వ వచనములో చుదువు చున్నాము. లేఖనములలో సైనికులయొక్క పని నాలుగు విధములుగా నున్నది. ప్రభువు వస్త్రములను పంచుకొనుట (యోహాను 19:23,24), కావలి యుండుట (మత్తయి 27:36), ప్రక్కన పొడుచుట (యోహాను 19:34), సైనికులు యేసు ప్రభువును అపహసించుట (లూకా 23:37), సైనికులు అక్కడ కూర్చుండి ఆయనను, సైనికులలో ఒకడు ఈటెతో ఆయనను
ప్రభువు వస్త్రపు చెంగు విశ్వాసముతో ముట్టిన వారు తమ వ్యాధులనుండి స్వస్థత పొందివున్నారు. (మార్కు 5:27-28) తాము అటువంటి ప్రభావముగల వస్త్రాలను సైనికులు తమలో తాము పంచుకొనుట చూచినప్పుడు వారికి ఆయన వస్త్రములో నున్న మహిమను గూర్చిన అవగాహన నున్నట్లుగా అర్థమగుచున్నది. ప్రభువు యొక్క అంగీని మాత్రము చించినవారు కారు. ఎదుకనగా అంగీ కుట్టు లేక పై నుండి క్రిందివరకు యావత్తు నేయ బడినది. ఆయన వస్త్రము ప్రభావముగలదు సైనికులు గ్రహించియున్నారు.
సైనికులు అలాగున ఆయన వస్త్రములను పంచుకొంటారని దావీదు తన కీర్తనలో 22:18లో ముందుగానే పలికివుంటు న్నాడు. ఆ ప్రవచనము యొక్క నెరవేర్పే సైనికులు ప్రభువు వస్త్రములు పంచు కొనుట.
చివరకు సైనికులు ప్రభువును, యూదుల

రాజైన యేసుక్రీస్తును కలువరి సిలువలో వస్త్రహీనునిగా చేసివున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు వస్త్రము లేనివాడుగా చేయుటలో కూడా ఒక అర్థము దాగివున్నది ఎట్లనగా యేసుక్రీస్తు "కడపటి ఆదాము" అని మరియు జీవింపచేయు ఆత్మ అని మొదటి ఆదాము "జీవించుప్రాణి" అని 1 కొరింథీ 15:45లో చదువుచున్నాము. మొదటి ఆదాము జీవించు ప్రాణియే కాక జీవించు ఆత్మయు అయి ఉన్నాయి. (ఆది. 2:7)

యేసు ప్రభువు వస్త్రము లేనివాడుగా సిలువలో మరణించుట అన్న అంశములో మరియొక గూఢర్థమును కలిగియున్నది. ఎట్లనగా దేవుడైన యోహోవా ఆదామును సృజించినపుడు వస్త్రములను ధరింప జేయలేదు. మొదటి ఆదామును వస్త్రము లేనివాడుగాను, మరియు పరిశు ద్ధుడుగానునున్నాడు. ఈ సమయంలో దేవుడు ఆదామునకు సాటియైన సహాయముగానుండుటకు స్త్రీని సృజించిగోరుచున్నాడు. ఈ స్త్రీకి సృజించక పూర్వము ఆదాము ఒంటరిగానేనున్నాడు. స్త్రీని సృజించ తలంచినప్పుడు మొదటగా ఆదామునకు దేవుడు గాఢ నిద్ర కలుగజేయగా ఆదాము నిద్రించినాడు (ఆది 2:21) ఆదాము గాఢనిద్రలో అనగా తనకు తాను ఏమి తెలియని స్థితిలో వుండగా దేవుడు ఆదాము ప్రక్కను గాయము చేసి అతని ఎముకులలో నొకదానిని బయటకు తీసి ఆ గాయమును మాంసముతో పూడ్చివేశాడు. (ఆది 2021) ఆ తరువాత దేవుడు ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను "స్త్రీ" నిగా నిర్మించి ఆమెను ఆదామునొద్దకు తీసికొని వచ్చాడు. దేవుని సృష్టి నిర్మాణ క్రమములో ఆఖరుగా సృజింపబడినది స్త్రీ అటు తర్వాత దేవుడు దేనిని సృజించలేదు. సృష్టిక్రమమును స్త్రీతో ముగించాడు దేవుడు. ఈ కార్యమంతాకూడ రానున్న కాలములో తండ్రియైన దేవుడు క్రీస్తును ఆయన సంఘమునకు గుర్తుగా జరిగించినట్లుగా కనబడుచున్నది. ఎట్లనగా దేవుడు స్త్రీని సృజింపక పూర్వము ఆదాము గాఢనిద్రలో వున్నాడు. అట్లయితే కడపటి ఆదాము అని చెప్పబడిన యేసు క్రీస్తు దేహములో నుంచి సంఘము అనే పవిత్రురాలైన కన్యక 2 కొరింథీ 11:2ను దేవుడు బయటకు తీసికొనివచ్చి ఆ కన్యకను సిద్ధపరచి యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడలో ఆ ఇద్దరిని క్రీస్తు సంఘము వివాహమందు జతపరచ బడాలి ప్రకటన 21:9, 19:6-8. ఇది దేవుని యొక్క గొప్ప అనాదికాల సంకల్పం. ఇందు కొరకు మొదటి ఆదాము విషయములో ఏ క్రియ అయితే జరిగించాడో, అదే విధానములో ''కడపటి ఆదాము'' విషయములో కూడ దేవుడు

జరిగించినాడు.
మొదటి ఆదాముకు గాఢనిద్ర కలుగచేసినట్లుగా, దేవుడు యేసు క్రీస్తును సిలువకు అప్పగించి, సిలువలో తన ప్రాణమును అర్పించుకొనునట్లుగా జరిగించాడు. క్రీస్తు శిలువలో తనతో కూడ శిలువ వేయబడిన నేరస్తులకంటె ముందుగానే మృతి చెందియున్నాడు. (యోహాను 19:33) "వారు యేసు నొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతి పొంది యుండుట చూచి ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు. ఈ మరణము "మరణనిద్రగా" గమనించాలి (కీర్తన 13:4) లాజరు చనిపోయినప్పుడు ప్రభువు ఇలా చెప్పాడు. మన స్నేహితుడైన లాజరు నిద్రించుచున్నాడు. అతని మేలు కొలుప వెళ్ళుచున్నానని వారితో చెప్పగా (యోహాను 11:11) యేసు అతని మరణమును గూర్చి ఆ మాట చెప్పెను (యోహాను 11:13) కనుక యేసు క్రీస్తు ప్రభువు సిలువలో మరణించుట చూడగా అది మరణ నిద్రగా వున్నది. ఆ సమయములో సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కన పొడిచెను. అనగా కడపటి ఆదాము అయిన యేసు క్రీస్తు ప్రక్కలో గాయము చేయబడెను. ఆ గాయములో నుండి రక్తమును, నీళ్ళను కారెను. (యోహాను 19:34) దీనిని కన్నులారా చూచిన యేసు ప్రేమించిన శిష్యుడైన యోహాను సాక్ష్యమిచ్చెను. అతని సాక్ష్యము సత్యమే (యోహాను 19:35) ఇక్కడ గమనించవలసిన దేమనగా యేసు ప్రభువు శిలువలో మరణించెనను తర్వాత ఆయన ప్రక్కలో ఈటితో పొడిచినారు. వెంటనే రక్తమును నీళ్ళను కారెను, ఇదెలాసాధ్యము మృత దేహములో నుండి రక్తము కారుట మనమెన్నడైన చూచివున్నామా? లేదా విని యున్నామా? లేదా? కాని యేసు ప్రభువు విషయములలో ఇది జరిగెను అనగా రక్తము కారింది. కనుకనే ఆ ప్రభవు రక్తములో జీవమున్నది. ఆ రక్తమే నేటి వరకు తరతరములకు సజీవమైనదై ప్రతి పాపియొక్క పాపమును మరియు మనస్సాక్షిని శుద్ధిచేయుటకు శక్తి కలిగియున్నది. యేసు ప్రభువు ప్రక్కలో నుండి కారిన రక్తముచే క్రీస్తు పాపులను కొని ఒక సంఘముగా (స్త్రీ లేదా కన్యకగా) సమకూర్చుతున్నారు. ఆ సంఘమే "పవిత్రురాలైన కన్యక" అని అపొస్తలుడైన పౌలు 2వ కొరింథీ పత్రిక 11:2లో వ్రాశాడు.

మొదటి ఆదాము యొక్క ప్రక్కలో నుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించిన దేవుడు, యేసుప్రభువు యొక్క ప్రక్కలో నుండి కారిన రక్తముచే "సంఘము" ను నిర్మించినాడు మరియు స్థాపించినాడు. ఆలాగు పుట్టిన సంఘమే క్రీస్తు యొక్క

లేదా గొఱ్ఱెపిల్ల భార్య (ప్రకటన 21:9) అని మనము గుర్తెరగాలి.

సిలువ దగ్గర వున్న వారిలో మరి కొంత మందిని గూర్చి క్రింద తెలియ చేయు చున్నాను.

**అధికారులు :**

సిలువలో వ్రేలాడుచున్న యేసు ప్రభువును అధికారులు ఈ విధముగా అపహసించుట లూకా 23:35లో చదువగలము. "వీడు ఇతరులను రక్షించెను; వీడు దేవుడేర్పరచు కొనిన క్రీస్తు అయిన యెడల తన్ను తాను రక్షించుకొనునని అపహసించిరి".

ఇతరులకు న్యాయము చెప్పవలసినవారు మరియు మార్గదర్శకులుగా నుండవలసిన అధికారులు ఈలాగున అపహసించుట ఎంతో విచారకరము. క్రీస్తు దేవుడు ఏర్పరచుకొనవాడు కాడని వారిభావము. ఇలాంటి వారిని నేడు కూడా లోకములో అనేకులను చూడగలము. అధికారులు తెలియక చేసినారని లేదా మాట్లాడారని పేతురు తన ప్రసంగములో సొలోమోను మంటపము దగ్గర ప్రసంగించినాడు (అపొ. కా. 3:17)

**3. శాస్త్రులు, పెద్దలు మరియు ప్రధానయాజకులు :**

వీరు కూడా యేసు ప్రభువును అపహసించుచు ఈలాగున అన్నారు. "వీడు ఇతరులను రక్షించెను, తన్ను తానే రక్షించుకొనలేదు. ఇశ్రాయేలు రాజు కదా, ఇప్పుడు సిలువ మీదనుండి దిగిన యెడల వాని నమ్ముదము. వాడు దేవునియందు విశ్వాసముంచెను నేను దేవుని కుమారుడనని చెప్పినుగనుక, ఆయన కిష్టమైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించుననిరి" మత్తయి 27:41-43

**4. శతాధిపతి :** ఈ శతాధిపతి యేసు ప్రభువు శిలువ కార్యమును పర్యవేక్షించుటకు నియమింపబడినవాడు, ప్రభువును సిలువ వేసిన సహాయములో జరిగిన కార్యమును చూచి ఇతడిచ్చిన సాక్ష్యము ఇలాగున వున్నది.

"నిజముగా ఈ మనుష్యుడు నీతిమంతుడై యుండెనని చెప్పి దేవుని మహిమ పరిచెను" లూకా 23:47

ఇకను మత్తయి సువార్త 27:54లోను ఈయన వ్రాయబడియున్నది.

"నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి"

యేసుక్రీస్తు సిలువ దగ్గరన్న వారందరి లోకెల్ల దేవుని మహిమ పరచిన వ్యక్తి ఈ 'శతాధిపతి' మాత్రమే

ప్రియ చదువరీ! నీ జీవితకాలములో ఎన్నడైన దేవుని మహిమపరచితివా! క్రీస్తు సిలువలో నీ కొరకే అవమానమును, నిందను, దూషణలను భరించావా అన్న సత్యాన్ని నీవు గ్రహించగలిగిన యెడల నీవు ధన్యుడవే

ప్రభువు మీకు సహాయపడును గాక (సశేషం)

-పాస్టర్. ప్రభాకర్

# యోబు సాక్ష్యము

క్రైస్తవ జీవితములో సాక్ష్యము చాలా ప్రాముఖ్యమైనది. సాక్ష్యము రెండు రకములుగా బహిర్గతమౌతుంది. 1. జీవించడము ద్వారా 2. ప్రకటించడము ద్వారా

యోబు గురించిన సాక్ష్యము యోబు గ్రంథములో ప్రారంభములోనే వ్రాయ బడింది. అతడు యధార్ధవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు (యోబు 1:1) దేవుడు ఒక వ్యక్తిని మెచ్చుకుంటే ఎంత బాగుంటుంది. దేవుడు ఒక వ్యక్తి విషయములో నొచ్చుకుంటే ఎంత బాధాకరముగా ఉంటుంది. దేవుని వలన మెప్పుపొందే సాక్ష్యము మనకు ఆశీర్వాదకరము.

దేవుడు యోబును గురించి 3 సార్లు సాక్ష్యమిచ్చాడు. యోబు 1:1లో యోబు 1:8లో మరియు యోబు 2:3 లో చూడగలము. దేవుడు యోబునుగురించి రెండవసారి మాట్లాడుతూ అతడు యధార్ధవర్తనుడును, న్యాయమంతుడునై దేవునినయందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు అంటూ ఆధారముగా మరియొక మాట తెలియపరుస్తున్నాడు. భూమి మీద అతని వంటివాడు ఎవడును లేడు అన్నాడు (యోబు 1:8) మూడవసారి దేవుడు యోబును గురించి అపవాదితో మాట్లాడుతూ నీవు నా సేవకుడైన యోబు సంగతి ఆలోచించావా? అతడు యధార్ధవర్తనుడును, న్యాయవంతుడనై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు భూమి మీద అతని వంటి వాడు ఎవడును లేడు అంటూ మరొక మాట అదనముగా ఇక్కడ తెలియపరుస్తున్నాడు. నిష్కారణముగా అతనిని పాడుచేయుటకు నీవు నన్ను ప్రేరేపించినను అతడు ఇంకను తన యధార్ధతను వదలక నిలకడగా వున్నాడు. (యోబు 2:3) యోబును గురించి దేవుడు సాక్ష్యమిచ్చేటప్పుడు కలిపే విషయాలు వున్నాయి కాని తీసివేసే విషయాలు లేవు. యోబు సాక్ష్యము ఏంటి అనగా యోబు యధార్ధత. యోబు జీవితము యధార్ధమైన జీవితము.

**యధార్ధత అనగా 1. చక్కగా నిలబడుట :** జీవితములో వంకరతనము లేకుండా చక్కగా నిలబడటం, జీవితం చక్కగా వుందా? వంకరగా వుందా? వంకర బుద్ధి, వంకరమాటలు, వంకర ప్రవర్తన, వంకరనడవడిక కలిగి జీవిస్తున్నావా? 18 ఏండ్ల నుండి వంగిన నడుముగల స్త్రీ మందిరములోనే ఉంది. సంఘములోనే వుంది. అయిననూ వంగిన స్థితి మనము చక్కగా నిలబడాలని దేవుడు కోరుతున్నాడు.

**యధార్ధత అనగా 2. నిజాయితీగా బ్రతకటము :** యోబు అవినీతి పరుడు కాదు, దుర్నీతి

పరుడు కాదు, స్వనీతి పరుడు కానే కాదు యోబు నిజాయితి పరుడు, నిజాయితిగా జీవించడమే యదార్థత.

**యథార్థత అనగా 3. ఉన్నది ఉన్నట్టుగా చెప్పుట :** యోబు జీవితము తేటగా కనబడుతుంది. యోబు సాక్ష్యములో కల్తీ లేదు. స్వచ్ఛత కన్పిస్తుంది. యోబు జీవితము తెరచిన పుస్తకమువలె కనబడుతుంది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పటమే యథార్థత.

యోబు యథార్థతను గురించి దేవుడు సాక్ష్యమిచ్చాడు. యోబు యథార్థతను గురించి సాతాను కూడా అంగీకరించక తప్పలేదు. యోబు యొక్క యథార్థతను గురించి భార్య కూడా సాక్ష్యమిచ్చింది (యోబు 2:9) అంటే యోబు ఎంత యథార్థవంతుడో తన భార్యకు తెలుసు. భర్త తన భార్య ఎదుట మంచి సాక్ష్యము కలిగి ఉండాలి. భార్య తన భర్త యెదుట మంచి సాక్ష్యము కలిగి ఉండాలి. తల్లిదండ్రులు పిల్లల ఎదుట, పిల్లలు తల్లిదండ్రుల ఎదుట మంచి సాక్ష్యము కలిగివుండాలి. యోబు తన స్నేహితుల చేతకూడా మంచి సాక్ష్యము పొందాడు. (యోబు 4:6) అంతేకాదు యోబ యథార్థతను గురించి యోబు మనస్సాక్షి కూడా సాక్ష్యమిచ్చింది. (యోబు 31:6,7) యెూబు మంచి సాక్ష్యజీవితమును కలిగి జీవించినట్లు మనము కూడా మన ప్రాంతాల్లో, పట్టణములలో, సంఘములలో మంచి సాక్ష్యము కలిగి జీవిద్దాం. అలాంటి కృప దేవుడు మనందరికి దయచేయునుగాక.

## ఆరోగ్య శీర్షిక

### మోకాళ్ళ నొప్పులు-రుమాటయిడ్ కీళ్ళవ్యాధి

సామాన్యముగా మోకాళ్ళు అంత త్వరగా నొప్పులు రావు. ఆ మోకాళ్ళు కీళ్ళు బలముగా ఉంటాయి. అయితే కీళ్ళ వ్యాధులలో గాని అధిక శరీర బరువు గాని, బహీనమైన కాలి కండరాలలో గాని ఈ నొప్పులు వస్తాయి. మొకాలి కీళ్ళళ్ళో ఉండే పదార్థము తగ్గిపోవడము కూడా ఒక కారణము. ఎక్కువగా మెట్లు వాడటము వలన కీళ్ళు పాడయ్యి నొప్పులు వస్తాయి. రుమాటయిడ్ అనే కీళ్ళ వాపుల అనారోగ్యము అన్నింటికన్న ప్రమాదకరమైనది. ఎందుకంటే ఈ రకమైన వ్యాధిలో ఆ జాయింట్ మొత్తము పాడయిపోతుంది. నొప్పి వచ్చినప్పుడే త్వరగా వైద్యుని సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకుని, వైద్యము మొదలుపెట్టాలి. ఈ రకమైన కీళ్ళ వ్యాధిలో మిగిలిని కీళ్ళు కూడా దెబ్బతింటాయి. కాబట్టి ఈ రకమైన కీళ్ళనొప్పులు ఉన్నప్పుడు త్వరగా వైద్యుని సంప్రదిస్తే ఖచ్చితముగా నొప్పులనుండి ఉపశమనము దొరకుతుంది.

**- డా॥ వి.వి. చందర్**

పాస్టర్ డానియేల్

# సిద్ధపడిన హృదయం-స్థిరమైన మనసు

మీ హృదయమును సిద్ధపరచుకొనుడి మీ హృదయమును స్థిరపరచుకొనుడి అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును మత్తయి 24:12
చల్లారడము వేడి నుండి చల్లగా మారడం అనేది ఒక పక్రియ
నిజమైన విశ్వాసులు దేవుని నుండి తొలగిపోవాలని ప్రణాళిక వేసుకోరు. కాని అకస్మాత్తుగా వారి జీవితములో ఎదురయ్యే శోధనలను ఎదుర్కోవడానికి వారి హృదయాలను సిద్ధపర్చుకోవడములో విఫలమవుతారు. దావీదు తన జీవితంలో రానైయున్న విపత్తులను ఎదుర్కోనడానికి తన హృదయమును ముందుగానే సిద్ధపరచుకున్న విధముగా మనము కూడా జీవితములోని తుఫానులను ఎదుర్కోనడానికి సిద్ధపడి యుండాలి. దీనుల హృదయాలు సిద్ధపరచెదను అని ప్రభువు కీర్తన 10:17లో వాగ్ధానము చేసి యున్నాడు.
కాబట్టి మన హృదయాలను సిద్ధపర్చుకోవడానికి దీనత్వము ముఖ్య సూత్రమై యున్నది. వైవిధ్యమైన రీతిలో మీరు దానిని నేర్చుకోబోతున్నారు. యాకోబు 1:21 అందుచేత సమస్త కల్మషమును, విఱ్ఱవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి.
మన ప్రాధాన్యతలను ఎలా ఏర్పరచుకోవాలో, వాటిని ఎలా అమలుచేయాలో బైబిల్ అనుసారంగా నేర్చుకోవాలి.
"అతడు తన మనస్సు యెహోవాను వెదకుట యందు నిలుపుకొనక చెడుక్రియలు చేసెను" (2 దిన. 12:14) అయితే కొంతమంది చెడు చేయాలని ఉద్దేశిస్తారు. వారు రోజు "నేను పాపం చేయాలి" అనే తలంపులతో మేల్కొనరు కాని ప్రభువును వెదకడానికి వారి హృదయాలను సిద్ధపరచుకొనరు కాబట్టి సులభంగా పాపములో పడిపోతారు.
2 దిన. 12:14లోని వాక్యభాగం దావీదు మనవడు అయిన రెహబాము అనే ఇశ్రాయేలు రాజు గురించి చెప్పబడింది. తన తండ్రియైన సొలొమోను మరణించిన తర్వాత 41 యేళ్ళ వయస్సులో సింహాసనాన్ని అదిష్టించాడు. తన పరిపాలన ఆరంభంలో తన హృదయాన్ని దేవునిపైన నిలిపాడు. దేవుని నామంలో ఒక ప్రవక్త చెప్పిన మాటకు లోబడి యుద్ధములో నుండి సహితం వెనుదిరిగాడు (2 దిన. 11:1-4) అయినప్పటికి తన 17 సంవత్సరాల పరిపాలనలో కేవలం 3 సంవత్సరములు

మాత్రమే ప్రభువు నందు స్థిరముగా ఉండగలిగాడు. మన జీవితంలో కూడా ఇటువంటివి జరుగుతూ ఉంటాయి. నా పరిచర్య అనుభవంలో అనేకులు ఒకానొక సమయంలో ప్రభువును యదార్థముగా ప్రేమిస్తూ దేవుని విషయాలపట్ల అత్యాసక్తిని కనపరచి, ఆ తరువాత వారు చల్లబడి ప్రభువు నుండి తొలగిపోయే అంతగా మరియు ఒకప్పుడు వారికి ఎంతగానో ఇష్టమైన విషయాలను సైతం విడిచి పెట్టేంతగా ప్రభువు నుండి దూరమై పోవడం చూసాను.

ఇది ఎలా సాధ్యము? ఇది ఎలా జరుగుతుంది?

ఎందుకంటే వారు దేవుని వెదకడానికి వారి హృదయాలను సిద్ధపరచుకోలేదు.

**సాతానుడి ప్రణాళిక :** వేడి నీటిలో మరుగు చిన్న కప్పను గూర్చి కథనం

ఒక కప్పను మరుగుతున్న నీటిలో అకస్మాత్తుగా వేస్తే అది బయటకు దూకుతుంది, కాని వెచ్చని నీళ్లలోకి అదే కప్పను వేసి నెమ్మదిగా ఆ నీటిని మరిగిస్తే రానైయున్న అపాయమును ఎరుగక అది మరుగుతున్న నీటిలోనే చనిపోతుంది.

నిజమైన విశ్వాసులు దేవుని నుండి తొలగిపోవాలని ప్రణాళిక వేసుకోరు. కాని అకస్మాత్తుగా వారి జీవితములో ఎదురయ్యే శోధనలను ఎదుర్కోవడానికి వారి హృదయాలను సిద్ధపర్చుకోవడములో విఫలమవుతారు.

సిద్ధపడుట అనే మాటకు స్థాపించబడుట, స్థిరపరచుట, లేదా అనుసరించుట అని అర్థము. ఒక సుదీర్ఘమైనకాలంలో చేసిన ఉద్దేశపూర్వకమైన ప్రయత్నాన్ని ఆ పదము సూచిస్తుంది. కీర్తన 57:7లో ఈ పదాన్ని దావీదు రెండుసార్లు ఉపయోగించాడు. దావీదు దాగియున్న గుహలోనికే సౌలు అతన్ని చంపడానికి వచ్చిన సమయంలో దావీదు ఈ కీర్తనను రచించాడు.

దావీదు మనుష్యులు దావీదు సౌలును చంపి అతని సింహాసనాన్ని స్వాధీనము చేసుకోమని ప్రేరేపించారు, కాని దావీదు అలా చేయలేదు ఎందుకు? సౌలు దావీదును చంపడానికి ప్రయత్నిస్తున్నాడు. కాబట్టి దావీదు సౌలును చంపితే అది ఆత్మరక్షణగా పరిగణించబడుతుంది కదా? అప్పుడు ఆయనను ఎవరు కూడా నిందించేవారు కాదు. మరియు బాధతో నిండిన అనేక సంవత్సరములను అతడు తొలగించుకోగలిగేవాడు. కానీ సౌలును చంపడం ద్వారా రాజ్యాన్ని స్వాధీనపరచుకొనకూడదని దావీదు ముందుగానే తన హృదయములో నిర్ణయించుకున్నాడు మరియు స్థిరపరచుకున్నాడు.

ఈ ఉదాహరణ గురించి ఆయన చెప్పిన మాటలు ఈ విధంగా ఉన్నాయి. "నా హృదయము నిబ్బరముగా ఉన్నది దేవా, నా హృదయము నిబ్బరముగా ఉన్నది నేను పాడుచు స్తుతిగానము చేసెదను (కీర్తన 57:7) తాను ఏమి చేయాలో, ఏమి

చేయకూడదో దావీదు అప్పటికే తన హృదయములో స్థిరపరచుకొనకపోతే, ఆ క్షణములో ఒత్తిడికి లోనయ్యేవాడు. కానీ అతను అప్పటికే సౌలు ప్రాణాలు తీయకూడదని తన హృదయాన్ని స్థిర పరచుకున్నాడు.

"స్థిరపరచుకొనుట" అనే పదానికి అర్థం. 1. నిశ్చయంగా, ఒక స్థానంలో ఉండుట, నిలకడ 2. మార్పు లేదా వైవిధ్యానికి లోబడి ఉండదు, స్థిరంగా 3. మనస్సులో గట్టిగా పట్టుకోవడం, ఒక స్థిర భావన (అమెరికన్ హెరిటేజ్ డిక్షనరీ).

మన హృదయాలను సిద్ధ పరచుకొనుటకు ఒక రహస్యం ఏమిటంటే శోధనలు ఎదురవ్వకముందే మనము ఏమి చేయాలో, ఏమి చేయకూడదో మన హృదయములో స్థిరపరచుకోవాలి. శోధనలు వచ్చినప్పుడు ఏమి చేయాలి అని దావీదు ముందుగానే తన హృదయమును సిద్ధపరచుకున్నాడు. చాలామంది క్రైస్తవులు ఎటువంటి సిద్ధపాటు చేసుకోరు అందువలనే శోధనలకు లోనవుతారు.

మీరు మీ హృదయాన్ని స్థిరపరచుకోవచ్చు మీరు ఏమి చేయాలో ముందుగానే నిర్ణయించుకోవచ్చు.

మెట్టుకు సహోదరులారా, ఏ యోగ్యత యైనను మెప్పైనను ఉండినయెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యాన ముంచుకొనుడి. ఫిలిప్పీ 4:8.

మనము ఆలోచించవలసిన విషయాలు ఉన్నాయని అపోస్తలుడైన పౌలు స్పష్టంగా చెబుతున్నాడు. మరో మాటలో చెప్పాలంటే మన ఆలోచనలు మనవే ఎంచు కొనవచ్చు. రోమా 7:22, 23 వచనముల ప్రకారం దేవుని వాక్యానికి విరుద్ధమైన ఆలోనలు మనకందరికీ కొన్ని సార్లు కలుగుతాయి. పాపమును గూర్చి ధర్మశాస్త్రము యుద్ధము చేస్తూ మన మనసులపై దాడి చేస్తుంది. కానీ పరిశు ద్ధ గ్రంథములో ఫిలిప్పీ పత్రిక ఈ విధంగా సెలవిస్తుంది. మనము ఇక్కడ కూర్చొని మన ఆలోచనలను గూడు కట్టుకొనవచ్చు. ఒక మనిషి తన హృదయములో ఆలోచించినట్లే ఉంటాడని బైబిలు చెబుతుంది. (సామె. 23:7) కాబట్టి మనము ఏమి ఆలోచిస్తున్నామనేది చాలా ప్రాముఖ్యము.

ఫిలిప్పీ 4:8లో చదివినప్పుడు మనము ఏమి ఆలోచించాలో ఎంచుకొనవచ్చు. ఏవి రమ్యమైనవో ఏవి న్యాయమైనవో, ఏవి మాన్యమైనవో వాటిని ఆలోచించండి. పాత నిబంధనలో వారు ఏమి చేసేవారంటే దేవుని వాక్యాన్ని తీసుకొని వారి గుమ్మ ములపైన మరియు వారి వస్త్రాలపై ఉంచుకునేవారు.

ఆ వాక్యము వారి ముందు నిరంతరం ఉండేది. వారు దేవుని వాక్యము గురించి రాత్రింబవళ్ళు మాట్లాడాలని, వాక్యాను

సారంగా నడవాలని దేవుడు ఆదేశించాడు. మరియు వారు తమ పిల్లలకు ఈ విషయాలన్నీ చెప్తుండేవారు. మనము ఏమి ఆలోచిస్తున్నామో అది చాలా ముఖ్యము. విజయవంతమైన జీవితాన్ని పొందాలంటే మనము దేవుని వాక్యాన్ని ఎప్పటికప్పుడు ముందు ఉంచుకోవడం చాలా ముఖ్యము. రమ్యమైన, న్యాయమైన, మాన్యమైన వాటికి వ్యతిరేకంగా ఆలోచించడమంటే దేవుని విషయాలు మరియు ఆత్మ విషయాల గురించి ఆలోచించక పోవడమే. రోమా 8:6 "శరీరానుసారమైన మనస్సు మరణము" అని చెప్తుంది. కాని ఆ వచనములోని తరువాతి భాగం "ఆత్మానుసారమైన మనస్సు జీవము మరియు సమాధానమునై యున్నది. దేవుని ఆత్మ సంబంధమైన విషయాలను ఆలోచించడం జీవము మరియు సమాధానమైయున్నది. లోకంలోని విషయాలు, డబ్బు, దురాశ మొదలైన వాటి గురించి మనము ఆలోచించడం మొదలుపెడితే, మన జీవితంలో ఏమి జరుగుతుందో మీకు తెలుసా? ఒక మనిషి తన హృదయంలో ఆలోచించినట్లే ఉంటాడు. మనము ఆ విషయాలపై పనిచేయడం ప్రారంభిస్తాము మరియు ఆ విషయాలనే మన జీవితంలో చేయడం ప్రారంభిస్తాము మరియు అది మన జీవితాలను నాశనము చేస్తుంది. మీరు చూసినట్లయితే, అపవాదిని ఎది రించాల్సిన సందర్భాలున్నా కూడా నిజమైన ఆధ్యాత్మిక యుద్ధము కొరకు విశ్వాసి నిజంగా అపవాదిని ఎప్పటికప్పుడు ప్రతిఘటించడం లేదు. కానీ ఆధ్యాత్మిక యుద్ధము మనము నివసిస్తున్న దానితో మరియు మనము ఆలోచించే వాటితో సంబంధం కలిగి ఉంటుంది.

యేసయ్య మనకు ఉదాహరణ

యెషయా 50:5-7 ప్రభువగు యెహోవా నా చెవికి విను బుద్ధి పుట్టింపగా నేను ఆయనమీద తిరుగుబాటు చేయలేదు వినకుండ నేను తొలగిపోలేదు. కొట్టువారికి నా వీపును అప్పగించితిని వెండ్రుకలు పెరికివేయువారికి నా చెంపలను అప్పగించితిని ఆమ్మివేయు వారికిని అవమానపరచు వారికిని నా ముఖము దాచుకొనలేదు. ప్రభువగు యెహోవా నాకు సహాయము చేయు వాడు గనుక నేను సిగ్గుపడలేదు నేను సిగ్గుపడనని యెరిగి నా ముఖమును చెకుముకి రాతివలె చేసికొంటిని.

చెకుముకి చాలా కఠిన రకమైన అవక్షేపణ శిల, ఒక చెకుముకి అంచును ఉక్కుతో కొట్టినప్పుడు నిప్పురవ్వలు వచ్చి అగ్ని ప్రారంభమవుతుంది.

మీ ముఖాన్ని చెకుముకిలాగా అమర్చడం అంటే, మీరు కొంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని, విపత్కర పరిస్థితుల్లో బలంగా నిలబడాలని సూచిస్తుంది. మీ ముఖాన్ని చెకుముకిలాగా అమర్చడం అంటే,

ఈ ఇబ్బందులు మిమ్మల్ని సరియైన దారికి తెస్తాయని మీరు పరిగణించినప్పుడు వాటిని విలువైనవిగా భావిస్తారు.
ఆయన ఇక్కడ ఉన్నాడు, మరియు ఆయన ఇందులో ఉన్నాడు. అందువల్ల ఆయన నా ముఖాన్ని చెకుముకిలాగా ఉంచాడు. ఆయన తన ముఖాన్ని నా కోసం చెకుముకిలా అమర్చినట్లే, మరియు లక్ష్యం వైపు అడుగులు వేయండి.
"ఓ విమోచింపబడిన వారలారా, ఎవరి వలన ఈ దృఢమైన సంకల్పం కలిగింది. ఈ స్థిరమైన, నిశ్చయమైన విమోచకుడి యొక్క విలువైన రక్తము ద్వారా మీరు కొనబడిన వారు, వచ్చి ఆయన గురించి ఆలోచించుడి. ఎవరైతే మీ కొరకు జీవించి చనిపోయారో ఆయన కొరకు జీవించడానికి మరియు చనిపోవడానికి మీ హృదయాలు మీలో మండుతూ, మీ ముఖాలు చెకుముకిలా తయారవులాగున ఉండండి". - సి.హెచ్. స్పర్జన్


# ఐనోను ప్రార్థనా మందిరము

**తెలుగు ఆరాధన సమయము :**
**ప్రతి ఆదివారము ఉ॥ గం॥10.00 నుండి మ॥ గం॥ 12.30 వరకు**
**ఆరాధన నడిపించువారు :**
**ఫస్ట్ పాస్టర్ వేజండ్ల నాగేశ్వరరావు గారు**

**ప్రార్థన అవసరతల కొరకు**
**సెల్ : 9494949199 కి కాల్ చేయవచ్చును.**
whatsapp number 9494949199 truevine ministries group
**లో సభ్యులుగా చేరండి**

**సిలువ నీడ పత్రిక** Online **లో చదువుటకు** www.aenonchurch.org login **అవ్వండి**
**ప్రియ చదువరీ ఈ శీర్షికలో మీకు ఆధ్యాత్మికంగా ఉపయోగపడిన సందేశము గూర్చి మీరు మాతో పంచుకోదలచిన యెడల ఈ క్రింది చిరునామకు పంపగలరు మీరు ఈమెయిల్ చేయదలచిన యెడల** tvmhyd@gmail.com **కి చేయగలరు.**

---

**ప్లాట్ నెం. 469, సెక్రటేరియేట్ హిల్స్(డా. వై.ఎస్.ఆర్. ఎన్‌క్లేవ్)కాలనీ, నేక్‌నామ్‌పూర్, పుప్పాలగూడ, రాజేందర్‌నగర్ మండలం, హైదరాబాద్-500 089. తెలంగాణ రాష్ట్రము**

-పాస్టర్ పి. ఐజక్

# అనుదినము

క్రీస్తు యేసుతో నమ్మకముగా నుండుము క్రీస్తు యేసునందు అత్యంత ప్రియ మైన పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీ అందరికి శుభములు కలుగును గాక.

దేవుడు మనతో అన్ని విషయములు మాట్లాడుచున్నాడా? లేక కొన్ని విషయములే మాట్లాడుచున్నాడా? ఒకసారి నేను అనేక విషయములను గూర్చి ప్రార్థించినప్పుడు లేదా ఆలోచించి నప్పుడు కొన్ని విషయాలకు మాత్రమే జవాబు దొరికినది కాని కొన్ని విషయాలకు మాత్రం ఎంత ప్రార్థించినా జవాబు దొరకలేదు కాని నేను దేవుని స్వరము వినలేక పోవుచున్నాను కాని ఎందుకో నాకు అర్థం కాలేదు. ఎందుకు దేవుడు మాట్లాడుట లేదు తెలియక ఎంతో బాధపడెవాడను. ఒకసారి వాక్యము చదువుచుండగా నా సమస్యకు సమాధానం దొరికింది. ఇదే సమస్య ఎంతోమంది జీవితములో జరుగుచున్నది. నేడు ప్రజలు దేవుని స్వరము వినుటలేదు, ఒకవేళ కొందరు దేవుని స్వరము వినుచుండినను గ్రహించలేక పోవుచు న్నారు. కొందరు అన్ని విషయములు దేవుడు వారితో మాట్లాడుట లేదని బాధపడుచున్నారు. ఇందకు కారణం ఏమిటి యెషయా 48:6-8 తెలియని మరుగైన క్రొత్త సంగతులు ఇకమీదట నీకు తెలియజేయున్నాను. అవి పూర్వము సృజించబడినవికావు అని ఇప్పుడు కలుగనవియే అవి నాకు తెలిసేయున్నవని నీవు చెప్పకుండునట్లు ఈ దినమునకు ముందు నీవు వాటిని వినియుండలేదు అవి నీకు వినబడనే లేదు, నీకు తెలియ బడనేలేదు. పూర్వము నుండి నీ చెవి తెరువబడనేలేదు. నీవు అపనమ్మకస్థుడవై అని వ్రాయబడియున్నది.

అప్పుడు నాకు అర్థమైన విషయం ఏమిటంటె మనము దేవునితో ఎంత నమ్మకముగా ఉంటామో అంతగా ఆయన మనతో మాట్లాడుతాడు మనము అధికముగా నమ్మకముగా ఉంటే ప్రతి విషయం ఆయన మనతో మాట్లాడుతాడు. ఇందునుబట్టి దేవుడు మీతో ఎంతగా మాట్లాడుచున్నాడు. మీ వ్యక్తిగత జీవితములో దేవుడు ఎన్ని విషయములలో శ్రద్ధ వహించుచున్నాడు. అందుకు కొన్ని ఉదాహరణలు

మనము ప్రార్థించినా దేవుడు మాట్లాడుట లేదు అంటే మన నమ్మకం ఎంతగా ఉంటుందో అంత అధికముగా దేవుడు

మనతో మాట్లాడతాడు.

**దేవుడు మాట్లాడిన వ్యక్తి:** ఆది. 18:17-19లలో అప్పుడు యెహోవా నేను చేయబోవు కార్యము అబ్రహామునకు దాచెదనా? అబ్రహాము నిశ్చయముగా బలముగల గొప్ప జనమగును అతని మూలముగా భూమిలోని సమస్త జనములు ఆశీర్వదించ బడును. ఎట్లనగా యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించినట్లు నేనతని ఎరిగియు న్నాననెను. ఈ వాక్యమును బట్టి దేవుడు అబ్రహాముతో ప్రతి విషయం చెప్పుచు న్నాడు. అసలు దేవుడు చేయబోవుచున్న ప్రతి కార్యము అబ్రహాముతో చెప్పుచున్నాడు. ఇది ఎంతో గొప్ప సంగతి మన జీవితములో ప్రతి విషయంలో దేవుడు పనిచేస్తే ఎంతో బాగుంటుంది. నెహెమ్యా 9:8-9 అబ్రహాము అను పేరు పెట్టినవాడవు నీవే అతడు నమ్మకమైన మనస్సుగలవాడని యెరిగి అతనితో నిబంధన చేసినవాడవునీవే అంటే అబ్రహాము నమ్మకమైన వాడని దేవుడు గుర్తించాడు గనుక దేవుడు మనతో మాట్లాడినచో ప్రతి విషయము మనము దీవించబడుదుము. ఆ ది. 24:1-2

**మరో వ్యక్తి మోషే :** సంఖ్యా. 12:7-8 అతడు నా యిల్లంతటిలో నమ్మకమైన వాడు నేను గూఢభావములతో కాదు దర్శనమిచ్చి ముఖాముఖిగా అతనితో మాటలా డుదును అతడు యెహోవా స్వరమును విని నిదానించి ఆయన స్వరూపమును చూచెను. నిర్గమ. 33:11 మనుష్యుడు తన స్నేహితునితో మాట్లాడినట్లు యెహోవా మోషేతో ముఖాముఖిగా మాట్లడెను, మాట్లాడుచుండెను. దేవుడు మోషేతో అధికముగా మాట్లాడుచుండెను. అధికముగా మాట్లాడినాడు. గనుక అతడు ధర్మశాస్త్రమును వ్రాసినాడు. దేవుని ఆలోచనలను ప్రజలకు తెలియజేసినాడు. ప్రజల మాటలను కూడా దేవునికి తెలియజేసినాడు. మోషే అన్ని విషయములలో నమ్మకముగా ఉండుట వలన అన్ని విషయములను అనగా ఎవరితో చెప్పలేనన్ని విషయాలు మోషేకు మాత్రమే దేవుడు తెలియజేసినాడు.

**మూడవ వ్యక్తి :** 1 కొరింథీ 14:37 ఎవడైనను తాను ప్రవక్తననియైనను ఆత్మసంబందినని యైనను తలంచుకొనిన యెడల నేను మీకు వ్రాయుచున్నవి. ప్రభువు యొక్క ఆజ్ఞలను ఆతడు దృఢముగా తెలుసుకొనవలెను. ఈ వాక్యమును బట్టి దేవుడు పౌలుగారితో మాట్లాడుచున్నాడు. పౌలుగారు ఎక్కువగా దేవుని స్వరమును విన్నాడు 2 కొరింథీ 4:16 కావున మేము అధైర్యపడము మా బాహ్యాపురుషుడు కృశించుచున్నాడు. అంతర్యపురుషుడు దిన దినము నూతన పరచబడుచున్నాడు. నూతన పరచబడుట అనగా ఎప్పుడు

నూతన పరచబడగలరు. అంటే దేవుని స్వరము విన్నప్పుడు మన అంతర్య పురుషుడు నూతన పరచబడగలడు దేవుడు పౌలుగారితో ఎక్కువ సార్లు మాట్లాడినాడు. నమ్మకముగా ఉన్నాడు.
కనుక అధికముగా ఎక్కువగా పత్రికలు వ్రాయగలిగినాడు. యౌవ్వనస్థులకు వృద్ధులకు, స్త్రీలకు సంఘాలకు నాయకులకు పిల్లలకు సేవకులకు సంబంధించిన అన్నిరకాల మనుష్యులకు సంబంధించిన విషయములు తమ పత్రికల యందు పొందుపరచారు. దేవుని స్వరమును వినినందునని తెలియు చున్నది.
కీర్తన 10:16 నా యొద్ద నివసించునట్లు దేశములో నమ్మకస్థులైన వారి కొరకు కనిపెట్టుచున్నాను. ఈ వాక్యములో దేవుడు నమ్మకస్థులైన వారి కొరకు కనిపెట్టు చున్నాడు. అయితే మనము ఎప్పుడు నమ్మకముగా ఉండగలము అంటే ప్రతి రోజు దేవునితో సహవాసములో నమ్మకముగా ఉండగలము. దాని. 6:10 ఇట్టి శాసనము సంతకము చేయ బడినదని దానియేలు తెలుసుకొనినను అతడు తన ఇంటికి వెళ్ళి యధాప్రకా రముగా అనుదినము ముమ్మారు మోకాళ్ళూని ప్రార్థించుచుండెను. అందునుబట్టి ఎంతో నమ్మకముగా దేవుని మార్గములో బలముగా నిలవగలిగినాడు.
ప్రియ చదువరులారా మీ జీవితములో మీరు అనుదినము దేవునితో సహవాసము కలిగి నమ్మకముగా ఉంటున్నారా. మీరు అనుదినము నమ్మకముగా ఉంటున్నారు అనడానికి మీ ప్రార్ధన జీవితము లేదా ప్రార్ధనాసమయం ఎంత? ఎందుకంటే ఏవో పనులు కొరకు దేవునితో సహవాసమును ప్రక్కన పెట్టి దేవునికంటె పనులకు పిల్లలకు స్నేహితులకు ధనమునకు వ్యాపారమునకు ఉద్యోగమునకు విలువనిచ్చి దేవునిలో సహవాసానికి తక్కువ సమయాన్ని ఇచ్చి దేవునికి నమ్మకముగా లేకపోతే ఎంతో ప్రతిఫలమును పోగొట్టుకుంటాము. ఒకరోజు దేవుని ఎదుట భళానమ్మకమైన మంచి దాసుడా అని పిలవబడలేము గనుక దేవునితో సహవాసం కలిగి నమ్మకముగా హానోకు వలె దావీదువలె అబ్రహాము వలె దానియేలువలె పౌలువలె అనుదినము ప్రభువు సన్నిధిలో ఎక్కువ సమయం గడుపుతూ క్రీస్తుకు నమ్మకముగా ముందుకు సాగె కృప క్రీస్తుయేసు నామములో తండ్రియైన దేవుడు మనకు దయచేయును గాక ఆమేన్

రాజేష్ చాలా ఆత్మీయముగా ఉండేవాడు, అతని ప్రతి అవసరమును దేవుని సన్నిధిలో ఉంచి ప్రార్థించి పొందుకునేవాడు. తాను అఫీసుకు రోజూ నడిచి వెళ్ళడము గాని, బస్సులో వెళ్ళడము గాని చేసేవాడు. చాలా రోజులు అలా గడిచాకా ఆయనకు ఒక సైకిల్ కొనుక్కోవాలనుకున్నాడు. అదే విషయాన్ని ప్రార్ధనలో పెట్టాడు. దేవా నాకు ఒక సైకిల్ కావాలి, రోజు ఆఫీసుకు వెళ్ళడానికి కష్టంగా ఉంది కాబట్టి ఒక సైకిల్‌ను ఇవ్వు అని ప్రార్థించడము మొదలుపెట్టాడు. రోజులు గడిచేకొద్ది ఆయనకు సైకిల్ దొరకలేదు, ఎంతో భక్తితో ప్రార్థించే నాకు దేవుడు ఎందుకు సైకిల్ ఇవ్వడము లేదు, ఏమిటి అని ఆలోచించసాగాడు రాజేష్. కొద్దిగా అసహనం మొదలయ్యింది, కానీ తప్పకుండా దేవుడు కావలసినది ఇచ్చే దేవుడే నేను అవసరానికి మించి అడగడము లేదు కదా అని అనుకున్నాడు. రోజు మరింత పట్టుదలతో దేవుని అడగడము మొదలుపెట్టాడు కానీ, దేవుని నుండి జవాబు వచ్చినట్టు కనపడలేదు, అయితే ఒక రోజు అతని అధికారి అతనిని పిలచి మన ఆఫీసు ఇక్కడనుండి మారుస్తున్నాము మరింత దూరము నీవు నడవవలసి రావడమో లేదా రెండు బస్సులు మారడమో జరుగుతుంది. అని రాజేష్‌తో చెప్పాడు. అంతే ఇక అతనికి నిరుత్సాహము ఎక్కువైనది. ఏంటి నేను సైకిల్ అడుగుతున్నాను రోజూ దేవున్ని కాని ఇప్పుడు ఆ సైకిల్ ఉన్నా ఉపయోగము లేదేమిటి, అయ్యో దేవుడా అని వాపోయాడు. అంతలో ఆ అధికారి తిరిగి రాజేష్‌ను పిలిచారు పిలిచి రాజష్ మీకు ఒక ద్విచక్రవాహనము ఆఫీసు తరుపున ఇస్తారు మీరు వచ్చే దారిలో రోజు ఒక స్టోర్ వద్ద ఆగి కొంత సామాగ్రి తేవాల్సి ఉంటుంది. అందుకొరకు మీకు కొంత వేతనము కూడా చెల్లిస్తాము, పెట్రోలుకు కూడా డబ్బులు ఇస్తాము అని చెప్పాడు.

ప్రియమైన దేవుని బిడ్డలారా దేవుని మనము అడుగునప్పుడు చాలా జాగ్రత్తగా అడగాలి, దయచేసి రాజేష్‌లా దేవునికి సలహాలు ఇవ్వకండి ఆయనకు తెలుసు మనకు ఏమి కావాలో, ఎప్పుడు కావాలో ఎలా ఇవ్వలో...

# బైబిలు పర్వతాలు - పారాను పర్వతము

ఈ పారాను పర్వతము పర్వత ప్రదేశము యొక్క ప్రస్థావన హోగరును గురించిన వాక్య భాగములో మొదలవుతుంది. పారాను ఒక అరణ్య ప్రదేశము. ఇశ్మాయేలు ఈ పారాను అరణ్య ప్రదేశమునందు నివసించెడివాడు. పారాను అంటే దేవుడే విమోచకుడు అని అర్థము. ఇశ్రాయేలీయులు ఐగుప్తు విడచిన తరువాత ఎక్కువ రోజులు, (చాలా సంవత్సరములు) పారాను అరణ్యములోను, కాదేషు అరణ్య ప్రాంతాలలో సముదాయములో గడిపారు. పారాను కొండకు సంభందించిన జ్ఞాపకాలు రెండు మారులు వ్రాయబడి ఉన్నవి. ద్వితియోప. 33:2లో ఒకటి, హబక్కుకు 3:3 లో రెండవది మొదటిది మోషే వ్రాసినారు. రెండవది హబక్కుకు వ్రాసినారు. ఈ రెండు మారులు దేవుడు ఇశ్రాయేలీయులను బానిసత్వమునుండి తప్పించి, వారిని దీవించిన విషయమును ప్రవక్తలు జ్ఞాపకము చేసికొనుచున్న భాగములు. ఎందుకంటే పారాను ప్రదేశములోనే ఇశ్రాయేలీయులు ఎక్కువకాలము నివసించినారు.

## ఐనోను ప్రార్థనా మందిరము

ప్లాట్ నెం. 469, సెక్రటేరియట్ హిల్స్, (డా. వై.ఎస్.ఆర్. ఎన్‌క్లేవ్ కాలనీ), నేక్‌నామ్‌పూర్, పుప్పాలగూడ,
రాజేందర్‌నగర్ మండలం, హైదరాబాద్-500 089. తెలంగాణ రాష్ట్రము.